# కార్మికులారా ఆశీర్వదించండి

- రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్
- ఎన్టీపీసీ లేబర్ గేట్‌లో ప్రచారం
- కాంట్రాక్ట్ కార్మికుల వేతన పెంపునకు ఉద్యమిస్తానని హామీ



కార్మికులను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

జ్యోతినగర్, నవంబర్: 23: 'ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులరా..కారు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించండి.' అంటూ రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ విజ్ఞప్తి చేశారు. తాను గెలిచిన వెంటనే వేతన పెంపు, ఏరియర్స్ అమలు కోసం ఉద్యమిస్తానని ప్రకటించారు. గురువారం ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో జరిగిన కార్మికుల ఆశ్వీరాద సభకు హాజరై మాట్లాడారు. ప్రత్యేక పోరాటంలో అగ్రభాగానా నిలిచిన కార్మికులకు అండగా ఉంటున్నానని చెప్పారు. 2018లో జేఏసీ సమక్షంలో కార్మికుల హక్కుల అగ్రిమెంట్‌ను సాధించినట్లు గుర్తు చేశారు. మీతో సత్యాగ్రహ దీక్ష చేపట్టి యాజమాన్యానికి తగిన బుద్ధిచెప్పానన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా ఒక్కతాటిపై వచ్చారో అలాగే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తనకు పదవులపై ఎలాంటి వ్యామోహం లేదని, ప్రజా సంక్షేమమే ధ్వేయమన్నారు. గతంలో ఇక్కడి ఎమ్మెల్యేలు ఏనాడు కార్మిల సంక్షేమం కోసం పట్టించుకోలేదని, ఉద్యమ, కార్మికుడి బిడ్డగా కార్మిక సమస్యలు తెలిసి అసెంబ్లీలో కార్మిక సమస్యలపై మాట్లాడినట్లు తెలిపారు. 55ఎళ్ల కాంగ్రెస్ దుర్మార్గపు పాలనలో ప్రజలు పడిన కష్టాలపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, సీఎం కేసీఆర్ కేవలం పదేండ్లలో ప్రతి గడుపకు సంక్షేమాన్ని చేరవేశారన్నారు. ఇక్కడి యువతకు ఉపాధి కోసం మంత్రి కేటీఆర్‌తో రూ. 30కోట్లతో ఐటీ పార్కు, 102 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. మంత్రి కేటీఆర్ రామగుండాన్ని దత్తత తీసుకొని మరో సిరిసిల్ల, సిద్దిపేటగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మిక సమస్యలను ఏనాడు పట్టించుకోని నాయకులు కార్మిక ఓట్లను అడిగే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ నేత టూరిస్టులా ఎన్నికల వేళ హైదరాబాద్ నుంచి వచ్చి ఎన్నికల తర్వాత హైదరాబాద్‌కు వెళ్తారని ఎద్దేవా చేశారు. తనను గెలిపిస్తే కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి, నగరపాలక మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు రమణారెడ్డి, కృష్ణవేణి, కవిత సరోజిని, కుమ్మరి శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెప్యాల రామారావు, ఎన్టీపీసీ జేఏసీ నేతలు ఇజ్జగిరి భూమయ్య, చిలుక శంకర్, నాంసాని శంకర్, నాగభూషణం, చందర్, రాజమల్లయ్య ఉన్నారు.



విలోచవరంలో పుట్ట మధూకర్‌తో మహిళలు

## పోతారం లిఫ్ట్ పూర్తిచేసి
# బీడు భూములకు నీరందిస్తా

- మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్
- పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం

మంథని రూరల్, నవంబర్ 23: పోతారం లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేసి ఎస్సారెస్పీ కాలువల ద్వారా మంథని మండలంలోని 30 వేల ఎకరాలకు నీరందించి సస్యశ్యామలం చేస్తానని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ప్రకటించారు. మండలంలోని ఉప్పట్ల, పోతారం, విలోచవరం గ్రామాల్లో గురువారం ముమ్మర ప్రచారం చేశారు. ఆయాచోట్ల మహిళలు పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. గ్రామాల ప్రజలు గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే సీఎం కేసీఆర్ ఇచ్చే రూ. వెయ్యికోట్లతో మంథని నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఇక్కడ 40 ఏండ్ల పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకే కుటుంబం అధికారంలో ఉందన్నారు. వాళ్లు ఆర్థికంగా ఎదిగారని, కానీ ప్రజల బతుకులను మార్చలేదని విమర్శించారు. అభివృద్ధిని విస్మరించారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఓటమి భయంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారన్నారు. అమ్ముడుపోయినవారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్‌గా నేను అభివృద్ధి చేయని ఊరు లేదు.. నేను సాయం చేయ ని మనిషి లేడన్నారు. ఈ మట్టిలో పుట్టిన మీ బిడ్డగా అడుగుతున్నా మరోసారి ఓటు ద్వారా ఆశీర్వదిస్తే మంథని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు బండ రవి, కొత్త శ్రీనివాస్, ఎగోలపు శంకర్‌గౌడ్, ఎక్కటి ఆనంతరెడ్డి, తగరం సుమలత, తగరం శంకర్‌లాల్, కారెంగుల సుధాకర్, బడికెల సదానందం, సాగర్, రాజయ్య ఉన్నారు.

# 'మంథని'పై గులాబీ జెండా ఎగురవేయాలి

- కార్యకర్తలు బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి
- మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్
- గులాబీ పార్టీలోకి టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నేతలు, యువకుల చేరిక




ఉప్పలపు నర్సయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధూకర్

మంథని, నవంబర్ 23: కార్యకర్తలు సమష్టిగా పనిచేసి మంథని గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. మంథనిలోని రాజగృహలో పల్మెల మండలానికి చెందిన టీడీపీ నేత కుమ్మరి సుధాకర్, మహాముత్తారం మండలం కోర్లకుంటకు చెందిన బీజేపీ నాయకులు, మహదేవపూర్ మండలం సురారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన ఉప్పులపు నర్సయ్య, ఉప్పట్ల గ్రామానికి చెందిన వెంకన్న తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పుట్ట మధూకర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేనివిధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. పథకాలను చూసే అన్ని పార్టీల నాయకులు, యువకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి పథకాలను వివరించాలని కోరారు.

## అనంతారం నుంచి తిరుపతికి పాదయాత్ర

జగిత్యాల రూరల్, నవంబర్ 23: బంగారు తెలంగాణే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని, జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా డాక్టర్ సంజయ్ కుమార్ గెలుపు కోసం అనంతారం నుంచి తిరుమల తిరుపతి వరకు పాదయాత్ర చేయడానికి ఎదుల శేఖర్ సిద్ధమయ్యాడు. అనంతారం గ్రామం నుంచి ఈ పాదయాత్ర గురువారం ప్రారంభమైంది. కాగా ఆయన పాదయాత్ర సాఫీగా జరగాలని, మూడోసారి సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గెలువాలని కోరుకుంటూ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అభినందనలు తెలిపారు.

## బీఆర్ఎస్‌లో చేరిన విశ్వబ్రాహ్మణ సంఘు నాయకులు

రాయికల్, నవంబర్ 23: అల్లీపూర్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు గురువా రం బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, మండల కో ఆప్షన్ సభ్యుడు ముఖీద్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మహేశ్, సంజీవరావు, పార్టీలో చేరిన వారిలో విశ్వబ్రాహ్మణ సం ఘం గ్రామ అధ్యక్షుడు పొలాస సురేశ్, ఉపాధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

## క్రీడాకారుడి ఎంపిక

జగిత్యాల, నవంబర్ 23: పెద్దపల్లి జిల్లాలోని సెంటినరీకాలనీలో 24వ తేదీన జరుగనున్న అండర్-17 ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల బాలుర విభాగంలో కల్లెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సాయి ఎంపికయ్యాడని పీఈటీ వెంకటలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని హెచ్ఎం విమల, సర్పంచ్ మహేశ్వర్ రావు, ఎంపీటీసీ పరశురామ్ అభినందించారు.

# ఈవీఎంల వినియోగంపై సిబ్బందికి అవగాహన

జ్యోతినగర్, నవంబర్ 23: ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రామగుండం నియోజకవర్గానికి సంబంధించి గురువారం ఎన్టీపీసీలోని ఆర్వో కార్యాలయంలో ఓటింగ్ ఈవీఎం యంత్రాల వినియోగం, మాక్ పోలింగ్‌పై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎం యంత్రాల మూడు విభాగాలు బీ, యూ, సీ, యూ వీవీప్యాట్ల అమరిక, అనుసంధానం, మాక్‌పోలింగ్, స్విచ్ఛాఫ్, ఆన్ చేయడం ఇతర కమిషనింగ్ పక్రియను ఈసీఐఎల్ ఇంజినీర్లు, మాస్టర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో వీడియో ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఇక్కడ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలికులు రా జేశ్‌సింగ్ రాణా, ఆర్వో అరుణశ్రీ, నోడల్ అధికా రి రామ్మోహన్‌రావు, ఏఆర్ఓ కుమారస్వామి, మాస్టర్ ట్రైనర్స్, ఇంజినీర్లు, సెక్టార్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# బీజేపీ మోసకారి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాల, నవంబర్ 23: ఎస్సీ వర్గీకరణ వంద రోజు ల్లో అంటూ మోసం బీజేపీ మోసం చేసిందని, వర్గీకరణ చేపట్టకుండా మాదిగ యువకుల ప్రాణాలను బలి తీసుకున్న కాంగ్రెస్ పార్టీకి, మాదిగ ఉపకులాల ప్రజలు ఒక్క ఓటు కూడా వేయకూడదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి లక్ష్మణ్ మాదిగ పిలుపునిచ్చారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి ఢిల్లీకి ప్రతినిధుల బృందా న్ని పంపి మాదిగల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకే తమ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని వారు తీర్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం 29 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుంటే కాంగ్రెస్, బీజేపీ ఓట్ల కో సం మాదిగలను వాడుకొని మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. గాంధీ భవన్ ఆవరణలో మాదిగ బిడ్డలు సురేందర్, దామోదర్, మహేశ్ ఆత్మహత్య చేసుకున్నా కాంగ్రెస్ మనసు కరగలేదని, అటువంటి పార్టీలు మాదిగలకు శాశ్వత శత్రువు అని, వారిని మాదిగలు ఎప్పటికీ నమ్మరన్నారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఒకే వర్గానికి కొమ్ముకాస్తుందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని, ఇటీవల జరిగిన మాదిగల విశ్వరూప మహాసభ ప్ర ధాని మోడీ రాజకీయ ప్రసంగం తప్ప మాదిగల జాతి ప్రయోజనం కోసం మాట్లాడలేదని కమిటీల పేరుతో కాలయాపన ఎందుకు? అని, ప్రధాని హోదాలో మోడీ వర్గీకరణపై ఎందుకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు.? అని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మందకృష్ణ కలిసి రాష్ట్రంలో ఆడుతున్న నాటకమని, మాదిగలపై చిత్తశుద్ధి ఉంటే మాదిగల విశ్వరూప మహాసభ ప్రసంగంలో పార్లమెంట్‌లో బిల్లు పెడతానని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. మాదిగలకు రిజర్వేషన్లు కావాలని, వర్గీకరించాలని, ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ రెండుసార్లు తీర్మానం చేసి కేంద్రానికి పంపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గెలిస్తే వర్గీకరణ అంశం ముందుకెళ్తుందని, కేసీఆర్ మాదిగలకు అండగా నిలుస్తారన్నారు.